క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



డోర్నకల్: స్థానిక బ్యాంక్‌స్ట్రీట్ వేంకటేశ్వరాలయంలో పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి 17వ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ఆవరణలో యాగపూజల అనంతరం ధ్వజప్రతిష్ఠాదులు, ధ్వజారోహణ వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన నాయకులు



కేసముద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులుగా ఇటీవల నియామకమైన వేం నరేందర్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కేసముద్రం మండలానికి చెందిన పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రునాయక్, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు ఎండీ.అయూబ్‌ఖాన్, మున్నాబాయ్, యూత్‌కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రియాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశపరీక్ష

కురవి: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ఆదివారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రవేశ పరీక్ష (ఇంటర్ ప్రథమ సంవత్సరం) ప్రశాంతంగా జరిగినట్లు రీజినల్ కోఆర్డినేటర్ ఆగస్టీన్ తెలిపాడు. 496 మందికి గాను 476 మంది హాజరు, 20 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నాడు.

ప్రశంస పత్రం అందజేత



మరిపెడ: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం కావడానికి కృషి చేయడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వరరావు అన్నారు. మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చిన్నాల రామనారాయణకు జిల్లా కోర్టులో శనివారం సాయంత్రం జడ్జి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలు అందజేయడం ద్వారా మరింత ఉత్సాహంగా విధులు నిర్వహిస్తారన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి టీషర్టుల పంపిణీ



నెహ్రూసెంటర్: మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మాస్కులు, క్యాప్‌లను డిపో మేనేజర్ శివప్రసాద్‌కు ఆదివారం అందజేశాడు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వరప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.రవిచందర్ రెడ్డి, ఆర్టీసీ డీఎం శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి

దంతాలపల్లి: ప్రతి గ్రామంలో పశుసంపదను కాపాడుకోవాలని మండల పశు వైద్యాధికారి వినోద్ అన్నారు. మండలంలోని రామానుజపురం గ్రామంలో పశువులకు వైద్యం అందించేందుకు అవసరమైన రూ.20వేల విలువ చేసే ట్రీవీస్‌ను గ్రామానికి చెందిన అక్కిరెడ్డి దామోదర్‌రెడ్డి శనివారం అందజేశాడు.

ఎర్రబెల్లి ట్రస్టు సేవలు ఆదర్శనీయం



పెద్దవంగర: ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. ట్రస్టు చైర్మన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు జన్మదిన వేడుకలను ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఐలయ్య నాయకులతో కలిసి కేక్‌కట్ చేశాడు. కార్యక్రమంలో సంజయ్, ముజీబ్, కాసాని హరీశ్, లింగమూర్తి, గంగాధర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తుది దశకు ‘గృహజ్యోతి’ సర్వే

- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా గుర్తింపు
- రేషన్, ఆధార్ నంబర్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- వినియోగదారుల్లో చిగురిస్తున్న ఆశలు



వివరాలు అప్‌లోడ్ చేస్తున్న విద్యుత్ అధికారులు (ఫైల్)

పెద్దవంగర: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి పథకం క్రింద లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే ప్రారంభమైంది. అందులో భాగంగా లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన ప్రక్రియ చేపడుతున్నారు. ప్రజాపాలన కార్యక్రమాల్లో నిర్వహించిన సభల్లో ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు తీసుకున్నారు. సదరు సమాచారాన్ని విద్యుత్‌శాఖ అధికారులు తీసుకొని అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. కాగా విద్యుత్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేచేస్తూ వినియోగదారుల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతోపాటు అద్దె ఇంట్లో ఉంటున్న వారి వివరాలను సైతం నమోదు చేస్తున్నారు.

పెద్దవంగర మండల వ్యాప్తంగా మొత్తం 8,476 రేషన్‌కార్డులు ఉన్నాయి. 4,513 గృహవిద్యుత్ కనెక్షన్లు ఉండగా 4,421 వినియోగంలో ఉన్నాయి. నెలకు 200 యూనిట్లలోపు ఉన్న కనెక్షన్లు 3,159 ఉన్నాయి. ఇప్పటి వరకు 4,311 కనెక్షన్ల వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. విద్యుత్ అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో వినియోగదారులు లేకపోతే సంబంధిత వివరాలను ఓ చీటిపై రాసి ఇచ్చిన నమోదు చేసుకుంటున్నారు.

చిగురిస్తున్న ఆశలు..

గృహజ్యోతి పథకం క్రింద జరుగుతున్న సర్వేతో మండల పరిధిలోని ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నెలకు 1-200 యూనిట్లు విద్యుత్‌ను వినియోగించే నివాసితులకు ఈ పథకం అమలు చేయాలని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం విదితమే. మండలంలోని 20 గ్రామపంచాయతీలు, వాటి అనుబంధ గ్రామాల్లో కరెంటు బిల్లు జారీ అయ్యే ప్రతి కుటుంబం నుంచి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్లను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఈ పథకం లబ్ధిపొందడానికి ప్రభుత్వం రేషన్‌కార్డును ప్రమాణికంగా తీసుకుంటుంన్నారు. రేషన్‌కార్డు లేనివారు విద్యుత్ సర్వీస్ నంబర్ ఆధారంగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోకున్న వివరాలను తీసుకుంటున్నారు.

సర్వే పూర్తి కావస్తోంది..



గృహజ్యోతి పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన డేటా ఆధారంగా అర్హులను నిర్ధారించే ప్రక్రియ పూర్తి కావస్తోంది. నేటికి సర్వే ప్రక్రియ పూర్తి అవుతుంది. ఇప్పటి వరకు 90శాతం పూర్తి అయ్యింది. విద్యుత్ వినియోగం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తులోని నంబర్ల ఆధారంగా సర్వే కొనసాగుతుంది. నేటితో సర్వే ప్రక్రియ ముగుస్తుందని వివరాలు ఇవ్వనివారు వెంటనే అందజేయాలి.

– రమేష్ బాబు, విద్యుత్ ఏఈ, పెద్దవంగర

‘గ్యారంటీ’లు వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న సక్రు

గార్ల: ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు వెంటనే మంజూరు చేయాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు జి.సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం స్థానిక ఎన్‌డీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయక పోవడం ప్రభుత్వానికి తగదన్నారు. అధికారులు ప్రజాపాలన దరఖాస్తులను పట్టుకొని ఇంటింటి సర్వే చేపట్టి అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా రైతుబంధు పథకం యాసంగి డబ్బులు 3 ఎకరాల వరకు మాత్రమే ఇచ్చి మిగతా రైతులకు నేటికీ ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు మనోహర్, వీరభద్రం, సక్రు పాల్గొన్నారు.

ఏఐజీసీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఎగురవేస్తున్న సంఘం ప్రతినిధులు

డోర్నకల్: స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్(ఏఐజీసీ) ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐజీసీ డోర్నకల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏఐజీసీ పతాకాన్ని సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐజీసీ డోర్నకల్ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్.నాగేశ్వర్‌రావు, చైర్మన్ శేఖర్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.రామాచారి, కోశాధికారి జె.భాస్కర్, అసిస్టెంట్ సెక్రెటరీ ఎం.అరవింద్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ జె.సంపత్, అసిస్టెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాజీ మహరాజ్ జయంతి ర్యాలీ



మాట్లాడుతున్న ఇందు భారతి

మహబూబాబాద్ రూరల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా మానుకోట పట్టణంలో నేడు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని హిందూ సమాజ్ నాయకురాలు ఇందు భారతి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వరీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మానుకోట జిల్లా కేంద్రంలోని ఛత్రపతి సెంటర్ (నర్సంపేట బైపాస్) రోడ్డు నుంచి ఉదయం 9:30 గంటలకు ద్విచక్రవాహన ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాణా శంకర్, మాలోత్ రవీందర్, పూనంచంద్ మాల్పాని, రోహిత్, గోపాల్ గిలడా, దిడ్డి మహేశ్, బవిరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మురళీనాయక్
- పలు గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



మహబూబాబాద్ రూరల్: అయోధ్య గ్రామంలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కేసముద్రం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. ఆదివారం కేసముద్రం మండలంలోని కల్వాల, అమీనాపురం, ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 2నెలల్లోనే కేసముద్రం మండలానికి గాను రూ.2.40కోట్ల నిధులను మంజూరయ్యాయని అన్నారు. అనంతరం కల్వాల, కోమటిపల్లి గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, కూరెల్లి సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ అంబటి లక్ష్మీ, గంట సంజీవరెడ్డి, కదిర సురేందర్, దామరకొండ ప్రవీణ్‌కుమార్, చిలువేరు సమ్మయ్యగౌడ్, గండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గూడూరు: అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని పొనుగోడులో ఆదివారం రూ.25లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల అభివృద్ధి పనులకు రూ.3కోట్ల 50 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, బొల్లికొండ మధుగౌడ్, బీరం శ్రీపాల్ రెడ్డి, ఎడ్ల నరేష్‌రెడ్డి, పూజారి శంకర్‌గౌడ్, ఎలమందల శ్రీనివాస్, చంటి స్వామి,రసూల్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని సోమ్లతండా, అయోధ్య గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్య మౌనికసురేందర్, పార్టీ అధికార ప్రతినిధి దేవరం ప్రకాష్ రెడ్డి, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, పీఆర్ ఏఈ రాజశేఖర్, ఎంపీటీసీ భూక్య రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

వేడుకలు విజయవంతం చేయాలి

జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠించిన బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఆదివారం శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, మిట్టకంటి రాంరెడ్డి, ఉదయ్ చందర్, లక్ష్మీనారాయణ, ఖలీల్, రమేష్, హరిప్రసాద్, జనార్దన్, సుధాకర్, గోపి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

తమకు ఉద్యోగాలు ఇప్పించాలని కోరుతూ 2008లో సెలెక్ట్ అయిన డీఎస్సీ అభ్యర్థులు ఆదివారం ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. డీఎస్సీలో సెలెక్ట్ అయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అభ్యర్థులు బాబు, రెడ్డి, షరీఫ్, ప్రభాకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గంగారం: తునికాకు సేకరణ టెండర్ ప్రక్రియను తక్షణమే పూర్తిచేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) గంగారం, కొత్తగూడ మండలాల కార్యదర్శి పూనెం ప్రభాకర్ అన్నారు. మార్చి 3,4,5 తేదీలలో ఖమ్మంలో జరుగు మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభల పోస్టర్లను ఆదివారం పందెం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనస్ చెల్లించడంలో ఫారెస్టు అధికారులు దొంగ పేర్లతో చేసిన అవినీతి కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఈరెల్లి మల్లేష్, ఈక భిక్షం, జోగరాములు, శ్రీను, చంద్రయ్య, నారాయణ, లక్ష్మయ్య, కృష్ణ, స్వామి, వెంకటయ్య, శ్రీను, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



గాయపడిన యువకుడు

గార్ల: ఎదురెదురుగా వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన గార్ల సమీపంలోని చలివాగు బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన గంగావత్ సూరిబాబు, గూగులోత్ డుంబు, అంజనాపురం గ్రామానికి చెందిన గూగులోత్ కోటేష్, బానోత్ శివాజీలు గార్ల సమీపంలోని చలివాగు బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా బైక్‌లపై వెళ్తూ ఢీకొనగా నలుగురికి చేతులు, కాళ్లు విరిగాయి. తీవ్రగాయాలైన క్షతగాత్రులను 108 సహాయంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు 108 సిబ్బంది నరేష్, ప్రశాంత్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై సందర్శించారు.

గుండెపోటుతో మహిళ మృతి

తిరుమలాయపాలెం: మిర్చి తోటల్లో కాయలు ఏరేందుకు వచ్చిన మహిళా కూలీ గుండెపోటుతో మృతిచెందిన ఘటన మండలంలోని పాపాయిగూడెంలో ఆదివారం జరిగింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయిగూడెం గ్రామానికి చెందిన అంబటి గీతాంజలి (30) మండలంలోని పాపాయిగూడెం గ్రామంలో రేపాకుల అరుణకు చెందిన మిర్చి తోటలో కాయలు ఏరేందుకు గ్రామస్తులతో కలిసి వచ్చింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో ఆమెను తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి తీసుకువెళ్లగా మృతిచెందింది. మృతురాలికి భర్త ఉపేందర్ కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలికి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైనుల ర్యాలీ



డోర్నకల్/గార్ల: పట్టణంలో జైనులు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. జైనమత గురువు విద్యాసాగర్‌జీ మహరాజ్(78) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజ్‌నంద్‌గావ్ జిల్లా, డోంగర్ ఘర్‌లోని చంద్రగిరి తీర్థంలో ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. విద్యాసాగర్‌జీ మృతికి స్థానిక ఆదినాథ్ భగవాన్ ఆలయంలో జైనులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో మౌనం పాటిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు.

పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కరువు..!

- రోడ్లపై దర్శనమిస్తున్న చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు



రోడ్డు వెంట డంపింగ్ చేసిన పెంటకుప్పలు

చిన్నగూడూరు: పారిశుద్ధ్య నివారణకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతుంటే తండాల్లో మాత్రం పారిశుద్ధ్యం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది. మండలంలోని మేఘ్యాతండా పంచాయతీ పరిధిలోని చినతండా పరిసరాల్లో పరిశుభ్రత లోపించి రోడ్ల వెంబడి పెంట కుప్పలు దర్శనమిస్తున్నాయి. పెంటకుప్పలను డంపింగ్ యార్డ్‌లకు తరలించాల్సిన సిబ్బంది రోడ్ల వెంబడే డంపింగ్ చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వాహనదారులు, కాలినడకన వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెంటకుప్పలు డంపింగ్ చేయడంతో దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలుపుతున్నారు. పారిశుద్ధ్యం నిర్వహణపై అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెంటకుప్పలు తొలగించాలని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మండలంలోని పలుగ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొందని మండల వాసులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై పెంటకుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గుప్పుమంటున్న గుడుంబా



గార్లలోని అండర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తాగి పడేసిన గుడుంబా కవర్లు

గార్ల: గార్ల మండలంలో గుడుంబాను నియంత్రించడంలో సంబంధిత ఎక్సైజ్ అధికారులు వైఫల్యం చెందారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో కాపుసారా విక్రయాల వ్యాపారం మూడుపూలు ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. గార్లలోని అంబేడ్కర్‌నగర్, తహసీల్దార్ బజారు, వికలాంగుల కాలనీ, జీవంజిపల్లి, పూసలతండా, పూమ్యాతండా, రాంపురం, అంజనాపురం, పినిరెడ్డిగూడెం, మర్రిగూడెం, పెద్దకిష్టాపురం గ్రామాల్లో సైతం గుడుంబా విచ్చలవిడిగా లభిస్తుంది. సంబంధిత శాఖా అధికారులు మాత్రం వచ్చి నామమాత్రంగా తనిఖీలు చేసి విక్రయదారుల నుంచి నెలవారి మామూళ్లు తీసుకొని వెళ్లిపోతున్నారని ఈ ప్రాంత మహిళలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రమైన గార్లలోనే గుడుంబా విచ్చలవిడిగా లభిస్తుందంటే, మండలంలోని మిగతా గ్రామాల్లో గుడుంబా విక్రయాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఎక్సైజ్ అధికారి స్పందించి మండలంలో గుడుంబా విక్రయాలను అరికట్టేలా చర్యలు చేపట్టి, ప్రజల ప్రాణాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట : పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగాల రాగసుధ, ప్రజాసంఘాల నాయకుడు కొత్తకొండ రాజమౌళి, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మార్త నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్‌ను ఆదివారం సందర్శించి సమస్యలను అధ్యయనం చేశారు. అనంతరం రాగసుధ, రాజమౌళి, నాగరాజు మాట్లాడారు. హాస్టల్‌లో నీటి సౌకర్యం లేక విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి సైతం ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బాత్‌రూంలు సరిగా లేవని తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. హాస్టల్‌లో సరైన కనీస వసతులు కల్పించకుండా ప్రభుత్వం వివక్ష పాటిస్తోందని విమర్శించారు. ఇప్పటికై నా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి హాస్టల్‌ను నూతన భవనంలోకి మార్చడంతోపాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని, హాస్టళ్లకు దోబీలను నియమించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు

పాలకుర్తి టౌన్: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఎస్సై మోడం సాయిప్రసన్న కుమార్ అన్నారు. మండలంలోని ముత్తారం గ్రామంలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత ఆదివారం నిర్వహించారు. ప్రజలకు మూఢనమ్మకాలతో పాటు బాల్య వివాహాలు, మత్తు పానియాల నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఎస్సై మాట్లాడుతూ.. నేరాల నివారణకు గ్రామాల్లో సీసీ కెమెరాలను గ్రామస్తులు, ఉద్యోగుల సహకారంతో ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాల్యవివాహాల ద్వారా జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. గుట్కా, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలతో యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వాటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలు జరిగినప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జాగృతి కళా బృందం ఇన్‌చార్జ్, ఏఎస్సై నాగమణి, కళా బృందం సభ్యులు వలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, పోలీసు సిబ్బంది డి.శ్రీనివాస్, భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.50వేల ఆర్థికసాయం

పాలకుర్తి: మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన రామరాజు యాదగిరి ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తూ ఇటీవల హనుమకొండలో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, ఆదివారం వల్మిడికి చెందిన ఉపాధ్యాయులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్దార్థ రవీందర్, వీరమల్ల బాబయ్య, దోకూరు రాజయ్య, దోకూరు సైదులు, వీరమల్ల రంజిత్, తండ మల్లయ్య, పోతుగంటి నర్సయ్య, కాసర్ల యాదగిరి, నీరటి వేణు, కొండ గణేష్, కూటికంటి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మేడారం అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది



జనగామ: దక్షిణాసియాలో రెండో కుంభమేళగా పేరుగాంచి రెండేళ్లకోసారి జరిగే మేడారం సమ్మక్క-సారక్క జాతరను గిరిజన ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం నిర్వహించడానికి మోదీ ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, డోర్నకల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ బేజాడి బీరప్ప అన్నారు. ఆదివారం ఆయనతో పాటు పలువురు నాయకులు మేడారంలో సమ్మక్క-సారలక్కలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క-సారలక్క పేర్ల మీద గిరిజన యూనివర్సిటీతోపాటు ఆధ్యాత్మిక పర్యాటక రంగంగా అభివృద్ధి చెందేలా టూరిజం కారిడార్‌గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.